క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరగాల్సిన సర్వ సభ సమావేశం వాయిదా పడినట్లు ఎంపీపీ ఆవులు శైలజ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కాకపోవడంతో పాటు కోరం లేని కారణంగా వాయిదా వేస్తున్నట్లు వివరించారు. అనంతరం తదుపరి తేదీని ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టాలి

కొత్తకోట రూరల్: కలెక్టర్ ఆదేశానుసారం బీఎల్ఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దమందడి మండలంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని తహసీల్దార్ సంధ్య అన్నారు. బుధవారం బీఎల్ఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరితో ఓటరు నమోదు చేయించేలా బీఎల్ఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఇదివరకూ ఉన్న ఓటరు కార్డులో ఏవైనా తప్పులు ఉంటే సరిచేయించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ తిరుపతయ్య, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.

పోరాట యోధుడు చేగువేరా



వనపర్తి టౌన్: యువకులు చేగువేరాను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ముందుకు సాగాలని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. బుధవారం చేగువేరా 95వ జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. చేగువేరా పోరాటాలు గురించి ఎంత చెప్పినా తక్కువే అని కొనియాడారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, దేవన్న నాయుడు, వెంకటస్వామి, ఈశ్వర్, నిదర్శన్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే సీఎం కేసీఆర్ లక్ష్యం



కొల్లాపూర్: ఆరోగ్య తెలంగాణను నిర్మించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో వైద్య, ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. వైద్యశాఖ సిబ్బందికి ప్రశంసాపత్రాలు, గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్లు అందించారు. ప్రభుత్వాసుపత్రి కొత్త అంబులెన్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకుముందు వేడుకల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. కేసీఆర్ కిట్లు, న్యూట్రీషియన్ కిట్ల పంపిణీ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. పట్టణంలో మాతా, శిశు సంరక్షణ కేంద్రం సేవలను ఆయన ప్రశంసించారు. డయాలసిస్ సెంటర్‌ను కిడ్నీ రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వంద పడకల ఆస్పత్రి పనులు పూర్తయితే ప్రజలకు ఇంకా మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ హనుమనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాసు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, చైర్మన్ కాటం జంబులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్ పాల్గొన్నారు.

కిలో వెండి బహూకరణ

అడ్డాకుల: కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి కర్ణాటకలోని రాయచూర్ ప్రాంతానికి చెందిన సత్యారం రమేష్ కుమారుడు వినయకృష్ణ, సత్యారం వేదాంశ్ కృష్ణ పేరుపై కిలోవెండి బుధవారం బహూకరించారు. ఈ మేరకు స్వామి వారు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు కిరీటాలు, కంఠాభరణము చేయించడానికి వెండి అందజేశారని నిర్వాహకులకు తెలిపారు. ఈ మేరకు దాతలను ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ అనంతశర్మ, కమిటీ సభ్యుడు నక్క రమేష్, అర్చకులు తదితరులు ఉన్నారు.

పీజీ కళాశాలలో పాటల పోటీలు

కొల్లాపూర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. సామాజిక, జానపద, తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన పాటలను విద్యార్థులు పాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మార్క్ పోలోనియస్, అధ్యాపకులు రమణ, పుట్ట శ్రీనివాసులు, శిరీష, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లోనే మెరుగైన విద్య

గోపాల్‌పేట: మండలంలోని మున్ననూరులో బుధవారం ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులందరి చేత ఓనమాలు దిద్దించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం అన్ని వసతులు ఉన్నాయిని ప్రతిభ ఉన్న ఉపాధ్యాయుల చేత బోధన చేస్తారన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. ఆయనతో పాటు ఉపాధ్యాయ బృంద సభ్యులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలు పాఠశాలలో చేరిక..

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని తల్లిదండ్రులు లేని ఆడ పిల్లలను బుధవారం సామాజిక కార్యకర్త, కౌన్సిలర్ అక్కమ్మ కస్తూర్బా గాంధీ పాఠశాలలో చేర్పించారు. పట్టణంలో తల్లిదండ్రులు కోల్పోయిన, అనాథ పిల్లలు, నిరుపేద కుటుంబానికి చెందిన వారి గురించి తమ దృష్టికి రావడంతో గతంలో ఆరుగురిని, ఈఏడాది ఆరుగురు పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి పాఠశాలలో చేర్చుకున్నామని ప్రత్యేకాధికారి పద్మ తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ..

పాన్‌గల్: మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న పాఠ్య పుస్తకాలను బుధవారం హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందజేసిన పుస్తకాలను భద్రంగా ఉంచుకుంటూ పాఠశాలకు క్రమం తప్పకుండా తీసుకురావాలన్నారు. ఇప్పటికి 90 శాతం పుస్తకాలు వచ్చాయని, మిగిలిన 10 శాతం పుస్తకాలు వచ్చిన వెంటనే వాటిని పంపిణీ చేస్తామన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం..

కొత్తకోట రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దమందడి మండలం మద్దిగట్ల ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఎంఈఓ జయశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య లభిస్తుందని, చిన్నారులకు ప్రాథమిక విద్య నుంచే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్స్, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



వెంగళాయపల్లిలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయులు



పెబ్బేరు కస్తూర్బాలో విద్యార్థులను చేర్పిస్తున్న కౌన్సిలర్ అక్కమ్మ



మద్దిగట్ల పీహెచ్‌సీలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈఓ జయశంకర్, ఉపాధ్యాయులు



మున్ననూర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

'స్త్రీనిధి' డబ్బుల గోల్‌మాల్

- మున్సిపల్ కమిషనర్‌కు మహిళా సంఘం సభ్యుల ఫిర్యాదు
- ఆర్పీ దండుకున్నారని ఆందోళన

అమరచింత: స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న మహిళా సంఘం సభ్యులు చెల్లించిన డబ్బులను బ్యాంక్‌లో జమ చేయకుండా ఆర్పీ స్వాహా చేశాడంటూ మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజాకు సభ్యులు బుధవారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని శ్రీచైతన్య ఏరియా లెవల్ ఫెడరేషన్ (వీఓ3)లోని జనచైతన్య మహిళా సంఘానికి సంబంధించిన స్త్రీనిధి డబ్బులను వసూలు చేసుకున్న ఆర్పీ రఘు అకౌంట్‌లో జమ చేయకపోవడంతో ఓవర్‌డ్యూ చూపుతుందని సంఘ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. మార్చి 2021 నుంచి ఏప్రిల్ 2023 వరకు రెగ్యూలర్‌గా స్త్రీనిధి డబ్బులు రూ.15,642 చెల్లించినా.. సంబంధిత స్త్రీనిధి అకౌంట్‌లో జమ చేయలేదన్నారు. అదేవిధంగా పాదుపు డబ్బులు నెలకు రూ.వంద చొప్పున చెల్లించినవి సైతం జనవరి 2021 నుంచి జనవరి 2023 వరకు రూ.14,400 బ్యాంకు ఖాతాలో జమ చేయలేదని ఆర్పీపై ఫిర్యాదు చేశారని కమిషనర్, మెప్మా కోఆర్డీనేటర్ యువరాజ్ తెలిపారు. అంతే కాకుండా ఇప్పటి వరకు ఆర్పీ రఘు తన సంఘాల పరిధిలో స్త్రీనిధి రుణం పొందిన సభ్యుల ద్వారా వసూలు చేసి ఇప్పటి వరకు రూ.4,29,113 చెల్లించలేదని వివరించారు. ఆర్పీ రఘు వ్యవహారంపై మెప్మా పీడీకి నివేదిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో జనచైతన్య మహిళ సంఘం సభ్యులు కుసల, జ్యోతిబాయి, సంధ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మహిళా సంఘం సభ్యులు

పాలిసెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మహిళా పాలిటెక్నికల్ కళాశాల ఆధ్వర్యంలో పాలిసెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు, తల్లిదండ్రులకు బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ ఏకే శ్రీకాంత్ అవగాహన కల్పించారు. పాలిసెట్ 2023లో అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సిలింగ్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్, సీటు అలాట్‌మెంట్, కళాశాలలో కోర్సుల వివరాలు, ప్రయోగశాలలు, బోధన సిబ్బంది, వసతులు, హాస్టల్‌లో ప్రత్యేకంగా సదుపాయాలు, వసతులపై పూర్తిగా అవగాహన కల్పించారు.

పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేయాలి

పాన్‌గల్: ప్రతి కార్యకర్త ఐకమత్యంతో పనిచేస్తూ బూత్ స్థాయిలో పార్టీ బలోపేతమే ధ్యేయంగా పనిచేయాలని కొల్లాపూర్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అన్వేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ మాట్లాడారు. బుధవారం మండలంలోని రేమద్దులలో పార్టీ నాయకులు సుందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాఘవేందర్ వారి ఆధ్వర్యంలో బూత్ నెం.98, 99, 100లో యువ సంఘటన అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వివరిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు.



ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రేషన్ బియ్యం పట్టివేత: కేసు నమోదు



పట్టుబడిన రేషన్ బియ్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు

పాన్‌గల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పోలీసులకు పట్టుబడిన ఘటన మండలంలోని కేతేపల్లి సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గద్వాల్ జిల్లా మానవపాడు మండలంలోని బోరెల్లి గ్రామానికి చెందిన ఎరుకలి నర్సింహ స్థానికంగా ఉన్న రేషన్ కార్డుల లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పక్కా సమాచారంతో కేతేపల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాన్ని స్టేషన్‌కు తరలించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు ఫరీదాబేగం, శ్రీధర్‌బాబుకు సమాచారం అందించగా.. వారు స్టేషన్‌కు చేరుకొని బియ్యాన్ని పంచనామా నిర్వహించి రేషన్ బియ్యంగా నిర్ధారించారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ రాంచందర్ పేర్కొన్నారు.

విద్యలో రాణిస్తేనే మంచి గుర్తింపు

వీపనగండ్ల: విద్యార్థులు చదువులో రాణించినప్పుడే కళాశాలతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు మంచి గుర్తింపు వస్తుందని వీపనగండ్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి అన్నారు. నూతనంగా కళాశాలలో చేరుతున్న విద్యార్థులను ఉత్తేజ పరిచే విధంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముద్రించిన డోర్ స్టిక్కర్లను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది తో కలిసి ఆయన బుధవారం విడుదల చేశారు. చదువు అనేది శక్తివంతమైన ఆయుధం అని నూతన విద్యా సంవత్సరంలో కళాశాలలో చేరుతున్న విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రామకృష్ణ, కుమార్, శివ, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న కళాశాల అధ్యాపకులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాల మూడో సెంటర్‌లో బుధవారం ఘనంగా ధ్వజస్తంభ, కలశ, బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి నిరంజన్‌రెడ్డి, వాసంతి దంపతులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వారిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, సర్పంచ్ మంజుల, రాధాకృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట, ఖిల్లాఘనపురం గ్రామాల్లో బుధవారం గంగమ్మ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కనులపండువగా నిర్వహించారు. ఖిల్లాఘనపురంలో ఉదయాన్నే ఆలయం వద్ద హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. మానాజీపేటలోని ముచ్చింతల అంజనేయస్వామి ఆలయం వద్ద హోమాలు, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్ఠాపన కార్యక్రమాలను వైభవంగా చేశారు. సాయంత్రం గంగమ్మ ఆలయం వద్ద గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు చేసి అమ్మవారికి సమర్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు మాజీ మంత్రి చిన్నారెడ్డి హాజరై పూజలు చేశారు. రెండు గ్రామాల్లో పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలకు హాజరుకావడంతో పండుగ వాతావరణం కనిపించింది.



ఖిల్లాఘనపురంలో మాజీ మంత్రి చిన్నారెడ్డిని సన్మానిస్తున్న గంగపుత్ర సంఘం సభ్యులు



మానాజీపేటలో ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న భక్తులు

దేవాలయ పనులకు భూమి పూజ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటం సమీపంలో ఉన్న లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడిగిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత నిధుల నుంచి రూ.15 కోట్లు మంజూరు చేశారన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పాలన చేశాయని, దేవస్థానాల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని యంగంపల్లిలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రవిగౌడ్, రాంరెడ్డి, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన చంద్రమ్మ అనారోగ్యానికి గురై బుధవారం మృతి చెందింది. జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి రూ.5 వేలను పంపడంతో వాటిని బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ ఖాజాషెరీఫ్, యూత్ అధ్యక్షులు బాలరాజు, మల్లికార్జున్, శ్రీనివాస్‌గౌడ్, జానకిరాములు తదితరులు ఉన్నారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ



శశికిరణ్



దేవరకొండ తరుణ్.



కుర్వ అఖిల.



సంగెపాగు నిఖిత.



అరవింద్.



స్మృతిలయ

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన తలకంటి మహిపాల్‌రెడ్డి, ఇంద్రాణి దంపతుల కూతురు స్మృతిలయ నీట్ ఫలితాలల్లో 720 మార్కులకు 696 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 366వ ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. వృక్షశాస్త్రంలో 180/180 మార్కులు, జంతు శాస్త్రంలో 180/180 మార్కులు, రసాయన శాస్త్రంలో 175/180 మార్కులు, భౌతిక శాస్త్రంలో 161/180 మార్కులు సాధించారు.

అమరచింత: పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు నీట్ ఫలితాల్లో సత్తా చాటారు. పట్టణానికి చెందిన కుర్వ అఖిల 527వ, దేవరకొండ తరుణ్ 467, దిడ్డి శ్రీవర్ధిని 427, వినీత్ 419, కావలి అరవింద్ 411, తెలుగు అక్షయకుమార్ 410, సంగెపాగు నిఖిత 409, ఠాకూర్ నరేశ్ 555వ ర్యాంకులను సాధించారు. పట్టణానికి చెందిన పలువురు నీట్ ఫలితాల్లో అమరచింత కీర్తి చాటడం హర్షనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ తెలిపారు.

ఆత్మకూర్: వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఆత్మకూర్ విద్యార్థి శశికిరణ్ జాతీయస్థాయిలో 650 ర్యాంకును సాధించి సత్తా చాటాడు. పట్టణానికి చెందిన రేణుక, గోవర్ధన్ దంపతుల కుమారుడు శశికిరణ్‌ను స్థానికులు, ఎంవీ రామ స్కూల్ అధినేత డాక్టర్ మొగిలి శ్రీధర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ఆన్సి శ్రీధర్, నిర్వాహకులు అభినందించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

అడ్డాకుల: వాల్మీకి బోయలను ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చాలని మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎంబీ బాలకృష్ణ డిమాండ్ చేశారు. మూసాపేట మండల వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ మంజులను కలిసి వినతిపత్రం అందజేశారు. కులవృత్తి లేని తమకు కూడా రూ.లక్ష రుణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, అచ్చాయపల్లి సర్పంచ్ చంద్రశేఖర్, కొండయ్య, దాసర్‌పల్లి రాజు, రవి తదితరులు ఉన్నారు.

అమరచింతలో ఆగని బైక్ చోరీలు

- సీసీ కెమెరాలున్నా దొంగల చేతివాటం
- పెట్రోల్ అయిపోగానే వదిలి వెళ్తున్న వైనం

అమరచింత: పట్టణంలో సీసీ కెమెరాలు ఉన్నా గుర్తు తెలియని వ్యక్తులు వరుసగా మోటార్ బైక్‌లను ఎత్తుకెళ్తున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నా పోలీసులు నివారించేందుకు చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదిహేను రోజుల నుంచి ఇప్పటి వరకు ఐదు మోటార్ బైక్‌లను అమరచింత నుంచి గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే ఎత్తుకెళ్లడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిఘా నేత్రాలను చౌరస్తాలో ఏర్పాటు చేసినా.. వాటిని గమనించకుండా వాహనాలను దొంగిలిస్తున్నారు. సీసీ కెమెరాల ద్వారా వీటిని గుర్తుపట్టి చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు సైతం ఇప్పటి వరకు ఎవరా వ్యక్తులు అని గర్తించలేకపోవడంతో అసలు సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో చోరికి గురైన ద్విచక్ర వాహనాలను దోచుకెళ్లిన వ్యక్తులు వాటిని అమ్మడమో లేదా భద్రపర్చుకోవడమో జరగడం లేదు. దోచుకున్న మోటార్ బైక్‌లను నడుపుకుంటూ వెళ్లిన దొంగలు వాటిలో పెట్రోల్ అయిపోగానే అక్కడే వదిలి వెళ్తున్నారు. ఇలాగే పట్టణానికి చెందిన పోబ్బతి రాముకు చెందిన బైక్‌తో పాటు శ్రీకృష్ణనగర్‌కు చెందిన వ్యక్తి బైక్‌లను నర్వ మండలంలోని యాంకి గ్రామ శివారులో వదిలి వెళ్లారు. నాలుగు రోజుల కిందట ఓ దినపత్రిక విలేకరి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాన్ని నర్వ మండలం పాథర్డ్ రహదారిలో వదిలి వెళ్లారు. విషయం తెలుసుకున్న వాహన యాజమానులే ఆయా ప్రదేశాలకు వెళ్లి తమ ద్విచక్ర వాహనాలను తీసుకొస్తున్నారు. పట్టణంలో సీసీ కెమెరాల పరిస్థితి మెరుగ్గా ఉంటే ఇలాంటివి ఎందుకు జరుగుతాయని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడును ప్రశ్నించగా టెక్నికల్ సమస్యలు ఉన్నాయని, మోటార్ సైకిళ్ల దొంగల గురించి విచారిస్తున్నామని, త్వరలో పట్టుకుంటామన్నారు.



అమరచింత ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా



నర్వ మండలంలోని పాథర్డ్ రహదారిలో దొంగలు వదిలిపెట్టిన ఎక్స్‌ఎల్

అభివృద్ధిలో దూసుకెళ్తున్న తెలంగాణ

గోపాల్‌పేట: అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతోందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కర్ణమయ్యకుంటతండా, లక్ష్మీతండా, పాటిగడ్డతండాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కర్ణమయ్యకుంటతండాలో గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి అక్కడే ఏర్పాటు చేసిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఆ తర్వాత లక్ష్మీతండా, పాటిగడ్డ తండాల్లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాలికెపాడులో సీసీరోడ్డు నిర్మాణం చేయడానికి గ్రామానికి చెందిన అమరేందర్‌రెడ్డిని సహకరించాలని మంత్రి నిరంజన్‌రెడ్డి కోరగా.. తనకు ఉన్న పొలంలో ఎకరా ఏడు కుంటలను గ్రామ పంచాయతీకి రాసిచ్చాడు. పొలం ఇచ్చిన అమరేందర్‌రెడ్డి మంత్రి సన్మానించారు.

పెబ్బేరు: రాష్ట్రంలోని గొల్ల కురుమలతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదిగేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో గుమ్మడంలో నిర్మాణం పూర్తిచేసిన యాదవ సంఘం కమిటీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, సర్పంచ్ సువర్ణ, కురుమూర్తి యాదవ్, రాజుయాదవ్, గౌని బుచ్చారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వనం రాములు యాదవ్, ఎండీ మజీద్, అంజనేయులు, కృష్ణ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయితీ భవనం, యాదవ కమిటీ హాల్ నిర్మాణం కోసం మంత్రి నిరంజన్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కురుమూర్తియాదవ్, నాగేంద్రయాదవ్, సర్పంచ్ సతీష్ తదితరులు ఉన్నారు.



కర్ణమయ్యకుంటతండాలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ఎంఈఓ పోస్టు భర్తీ చేయాలి

కోడేరు: మండలంలో ఎంఈఓ పోస్టును భర్తీ చేయాలని ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఏసీబీకి పట్టుబడటంతో 8 నెలలు కావస్తున్నా పోస్టు ఖాళీగా ఉంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురుకుల, నవోదయ తదితర పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రికార్డు షీట్ మీద ఎంఈఓ సంతకం కావాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అడుగుతుండటంతో విద్యార్థులు చేసేది లేక నాగర్‌కర్నూల్ డీఈఓ కార్యాలయానికి వెళ్లి డీఈఓ సంతకం చేయించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిసార్లు డీఈఓ దొరకక పోవడంతో గంటల తరబడి కార్యాలయంలో వేచి చూడాల్సి వస్తుందని విద్యార్థులు అంటున్నారు.